క్లుప్తంగా

నూతన నియామకం



జగన్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నాగిళ్ల జగన్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని కొత్తపేట బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జగన్‌ను నియమించారు. అనంతరం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నాయకులు బ్రహ్మయ్య, ఎల్లయ్య, శ్రీను, శంక ర్, లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగు రోజులు ఏపీజీవీబీ సేవలు బంద్



తిరుపతి, మేనేజర్, ఏపీజీవీబీ

ఆమనగల్లు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరును జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా కేంద్ర ప్రభుత్వం మార్పు చేయనుందని ఏపీజీవీబీ ఆమనగల్లు శాఖ మేనేజర్ తిరుపతి తెలిపారు. ఇందుకు ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంకు సేవలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, ఆన్‌లైన్ సేవలు కూడా నిలిచిపోతాయన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం.. అన్ని రాష్ట్రాలలో ఉన్న పలు రకాల గ్రామీణ బ్యాంకులన్నింటిని కలుపుతూ ఆయా రాష్ట్రం పేరిట గ్రామీణ బ్యాంకులను మారుస్తుందని, అందులో భాగంగా ఏపీజీవీబీ మార్పనున్నట్లు వెల్లడించారు. జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా ఖాతాదారులకు సేవలు అందిస్తామని ఆయన వెల్లడించారు.

మంచిపనులే చిరస్థాయిగా.. నిలుస్తాయి

ఆమనగల్లు: తమ జీవితకాలంలో చేసిన మంచి పనులు చిరస్థాయిగా నిలుస్తాయని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌లు అన్నారు. గురువారం తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ తండ్రి జంగయ్యయాదవ్ సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య చిత్రపటం వద్ద నేతలు నివాళులర్పించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, అనురాధ పత్యానాయక్, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధన రుసుం బకాయిలు చెల్లించండి

ఇబ్రహీంపట్నం: బోధన రుసుం, ఉపకార వేతనాల బకాయిలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయని బీజేవైఎం జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. నాలుగేళ్లుగా ఫీజు రియంబర్స్‌మెంట్ అందకపోవడంతో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు.. కళాశాలల యజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. చదువు పూర్తయిన నేపథ్యంలో ఉద్యోగ అవకాశాలు వస్తున్నా ధ్రువీకరణ పత్రాలు లేక, దరఖాస్తు చేసుకోలేని స్థితిలో ఉన్నారని వెల్లడించారు. పిల్లల బాధ చూడలేక వారి తల్లిదండ్రులు అప్పు చేసి ఫీజులు చెల్లిస్తున్నారని వివరించారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులు ఉన్నత చదవులకు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

శ్రమతోనే గెలుపు సాధ్యం

యాచారం: ఏ రంగంలోనైనా నిరంతర శ్రమతోనే విజయం సాధ్యమవుతుందని, ఒకసారి ఓటమి పాలైతే కృంగి పోవద్దని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. పీఎస్ పరిధి ఆకులామైలారం గ్రామంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నీ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు న్యాయం చేయాలి

యాచారం: ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు.. ఇంటి స్థలం లేని నిరుపేదలను గుర్తించి, వారికి స్థలాలు అందేలా కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా నిజమైన లబ్ధిదారులను గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు.

అసౌకర్యాల ప్రాంగణం



ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్

ఆదాయంపైనే ఆర్టీసీ దృష్టి
- ప్రయాణికుల సౌకర్యాలు పట్టని సంస్థ
- బస్సులు నిలిపేందుకు పాయింట్లు కరువు
- కనీస వసతులు కల్పించని వైనం
- పట్టించుకోని అధికారులు

ఆమనగల్లు: పట్టణ కేంద్రంలోని ప్రయాణప్రాంగణం అసౌకర్యాలకు నిలయంగా మారింది. చాలీచాలని విస్తీర్ణంలో ఉన్న బస్టాండులో బస్సులు నిలిపేందుకు సరైన పాయింట్లు లేక ఉద్యోగులు, కూర్చునేందుకు బల్లలు, ఇతర సౌకర్యలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆదాయం పెంచుకునేందుకు చూపిస్తున్న శ్రద్ధ.. ప్యాసింజర్ల సౌకర్యాల ఏర్పాటును సంస్థ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజా రవాణా విస్తరించినప్పటికీ.. ప్రయాణికుల సంఖ్య పెరిగిప్పటికీ.. దశాబ్దాల క్రితం కొద్దిపాటి స్థలంలో నిర్మించిన బస్టాండను ఎలాంటి విస్తరణ చేపట్టకుండా. అభివృద్ధి చేయకుండా వినియోగించడం అసౌకర్యాలకు చిరునామాగా మారింది.



మూత్రశాలలు, మరుగుదొడ్లు

విస్తరణకు నోచుకోక..

రెండు దశాబ్దాల క్రితం ఆమనగల్లు పట్టణంలో కొద్దిపాటి స్థలంలో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణప్రాంగణాన్ని విస్తరించడంతో పాటు.. అందుకు తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. కానీ.. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న పట్టణంలోని బస్టాండ్ విస్తరణకు నోచుకోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో బస్సులు, వేల సంఖ్యలో ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నా.. కనీస వసతులు కల్పించేందుకు సంస్థ దృష్టి సారించలేక పోతోంది. ఇదే విషయమై సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆదాయంపైనే..

బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలం, దుకాణ సముదాయాలను అద్దెకు ఇచ్చి, కిరాయి రూపేనా సంస్థ ఆదాయం పొందుతోంది. కానీ.. బస్టాండ్ విస్తరణ, ప్రయాణికుల ఇక్కట్లను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రయాణికులకు అనుగుణంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. ఇప్పటికైనా.. సంస్థ అధికారులు ప్రాంగణంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాటాలతోనే దోపిడీకి అడ్డుకట్ట



ఇబ్రహీంపట్నం: సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో పార్టీ శ్రేణులు

- పేదలకు అండగా ఎర్రజెండా: సీపీఐ నేతలు
- ఘనంగా పార్టీ శతాబ్ది ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం: దేశ స్వాతంత్ర పోరాటంతో పాటు, దోపిడీ దారులకు వ్యతిరేకంగా సీపీఐ ఉద్యమించిందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. కార్మికులు, పేదల ప్రజల పక్షాన ఎర్రజెండా నిలుస్తుందని, పోరాటాలతోనే దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని వెల్లడించారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుని గురువారం ఇబ్రహీంపట్నంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ్మా.. జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న పార్టీ ఆవిర్భవించిందని, నేటితో వంద సంవత్సరాలు పూర్తిచేసుకుందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వేలాది మంది ప్రాణత్యాగం చేసిన చరిత్ర బారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిస్టు కమ్యూనిస్టు భావాలను వ్యాప్తి చేసిందన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇటీవల చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నర్సింహ్మా, జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య, బి.నర్సింహ్మా, జె నర్సింహ్మా, శ్రీహరి, ఎల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లో..

సాయుధ పోరాటంలో కీలకం

తుర్కయంజాల్: దేశ స్వాతంత్ర్య, తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు, అనేక కార్మిక, కర్షక ఉద్యమాల్లో సీపీఐ కీలక భూమిక పోషించిందని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య తెలిపారు. పార్టీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా కౌన్సిల్ సభ్యుడు పి.శివకుమార్ అధ్యక్షతన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఇందులో నాయకులు శ్రీను, శివ కుమార్, శ్రీకాంత్, విజయ, సుందరమ్మ, భాస్కర్, రాములు, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్



మాట్లాడుతున్న భీంభరత్

షాబాద్: కార్యకర్తలు పార్టీ బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌గూడ పీఎస్ఆర్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతి నిరుపేదకు అందాలన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిందని, మహిళా సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ నెల 28వ తేదీన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, పీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింహులు, యూత్ అధ్యక్షుడు సురేందర్, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు బండ మహేందర్‌గౌడ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఈసీ వాగు వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

షాబాద్: కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ–పామెన గ్రామాల మధ్యలో ఉన్న ఈసీ వాగుపై రూ.5కోట్లతో నిర్మించిన వంతెనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ నెల 28న వంతెనను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ గ్రామాల మధ్యలో ఉన్న వాగులపై వంతెనల నిర్మాణ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు షాబాద్ దర్శన్, చెన్నయ్య, పొన్న వెంకట్‌రెడ్డి, తమ్మలి రవీందర్, పీసరి వెంకట్‌రెడ్డి, అశోక్, ఒదడు రాహుల్‌గుప్తా, రాంరెడ్డి, ఖాజామీయా, ఆక్తర్‌పాషా, శ్రీనివాస్‌రెడ్డి, పండు, మల్లేశ్, హస్మత్‌పాషా, ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

నిరుపేదలకు న్యాయం

శంకర్‌పల్లి: కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని కొండకల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రామ శివారులో వారికి ఘన స్వాగతం పలికి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని శివాజీ, అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాల వేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కేశంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగిళ్ల భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మొదటగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ నర్సింలుశెట్టికి అమిత్‌షాపై ఫిర్యాదు చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. పట్టణంలోని మరియారాణి పాఠశాల ఆవరణలో నిర్వహించిన 15వ రాష్ట్రస్థాయి జూనియర్ చౌక్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి గురువారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారిందరినీ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తాచాటి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అథ్లెటిక్ క్రీడాకారులు శంకర్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, నాయకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

ఆమనగల్లు: సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ శివశంకర్, నాయకులు పెంటయ్య కోరారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో గురువారం మహాసభల కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 28, 29 తేదీలలో ఇబ్రహీంపట్నంలోని భరత్ పంక్షన్ హాలులో నిర్వహించే సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇందులో నాయకులు పర్వతాలు, జంగయ్య తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జగదీశ్



ఇబ్రహీంపట్నం: ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రెండోసారి పయ్యం శెట్టి జగదీశ్ ఎన్నికయ్యారు. సిద్దిపేటలో జరిగిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో నియమించినట్లు గురువారం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన వారికి, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర కార్య సమితి సభ్యుడిగా శివకృష్ణ

యాచారం: ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యుడిగా మాల్ గ్రామానికి చెందిన దొంతగోని శివకృష్ణను నియమించారు. సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువారం శివ మాట్లాడుతూ.. ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి ఏబీవీపీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

రేషన్ డీలర్ మృతి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ మహ్మద్ అన్వర్ గురువారం మృతి చెందాడు. తన క్లాస్‌మెట్ అయిన అన్వర్ మృతి విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్.. తోటి మిత్రులతో కలిసి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాల్యం రోజులను గుర్తుకు చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు.

నియామకం

బడంగ్‌పేట్: కురుమలు గురువారం కుల పెద్దల సమక్షంలో సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం బడంగ్‌పేట అధ్యక్షుడిగా గౌర సాయికుమార్, ఉపాధ్యక్షులుగా కడారి భిక్షపతి, కొంద్రు చంద్రయ్య, గౌర రాకేశ్‌కుమార్, గౌర కొముర‌య్య, ప్రధాన కార్యదర్శిగా చిన్నరావుల రవీందర్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా దొడ్డి వెంకటేశ్, గౌర శ్రీనివాస్, కోశాధికారిగా గౌర శివకుమార్, గౌరవ సలహాదారులుగా గౌర సత్తయ్య, దొడ్డి మల్లికార్జున్, దడిగ ఐల య్య, కార్పొరేటర్లుగా గౌర రమాదేవి శ్రీనివా స్, గౌర సురేశ్, కార్యవర్గ సభ్యులుగా దండ్ల మహేందర్, గడిగె రాఘవేంద్ర, కడారి నర్సింహ, గౌర వెంకటేశ్, గౌర కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులకు నియామక పత్రం అందజేశారు.

ముసురుకున్న వాన

మునుగేసిన ప్రజలు

ఇబ్రహీంపట్నం: వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అసలే చలికాలం.. ఆపై చల్లటి గాలులతో కూడిన చిరు జల్లులు ఏకదాటిగా కురవడంతో ఇంటినుంచి బయటకు రాలేకపోతున్నారు. దీనికి తోడుగా ఉదయం, రాత్రి వేళలో దట్టమైన మంచుపొగ కమ్ముకోవడంతో అత్యవసరమైతే తప్ప.. వెలుపలకు రాలేకపోతున్నారు. వాహనదారులకు ముందు వచ్చే వాహనాలు కనబడక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బుధవారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం 8 గంటల వరకు 2.9 మిమీ వర్షం కురువగా.. గురువారం ఉదయం 8 గంటల వరకు 3.4 మిమీ వర్షపాతం నమోదయింది. ముసురుతో మొదలై..ఓ మాదిరి వర్షం పడి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. మధ్యాహ్నం కొంత తగ్గినా.. సాయంత్రం నుంచి ముసురు కమ్ముకుంది. మరో మూడు రోజుల పాటు తుపాన్ ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల అత్యల్పంగా రాత్రి ఉష్ణోగ్రత్తలు ఇబ్రహీంపట్నం ప్రాంతంతో నమోదైన నేపథ్యంలో ఈ ముసురుతో వాతావరణం మరింత చల్లబడే ఆవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా చలికాలంలో వానలు పడటం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థి

మహేశ్వరం: మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ గ్రామ సమీపం శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న అవేర్ మాధవన్‌జీ కేంద్రంలో యోగా విద్య వికాస కేంద్రం ఆధ్వర్యంలో గురువారం యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. యోగా సాధనతో మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడడంతో పాటు రక్తపోటు తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని యోగా గురువు మోహన్‌బాబు తెలిపారు. అవేర్ సంస్థలో యోగా విద్య వికాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు పలువురు యోగా ఆసనాలు చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

మేయర్‌కు సన్మానం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలో గతుకులమయంగా ఉన్న మట్టి రోడ్ల అభివృద్ధికి కృషి చేసిన మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డిని గురువారం వినాయకహిల్స్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఎన్నో ఏళ్లుగా గతుకులు, పెద్ద గుంతలు పడ్డ మట్టి రోడ్లపై ఇబ్బందులకు గురయ్యామని గుర్తుచేశారు. 5వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏదుళ్ల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.9 లక్షలు కేటాయించి బీటీరోడ్డు వేయించినందుకు మేయర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌యాదవ్, డాక్టర్ రవి, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలుగౌడ్ తదితరులు ఉన్నారు.



మేయర్ దంపతులను సన్మానించిన కాలనీవాసులు

సందడిగా ధ్యాన మహాయాగం



కళాకారుల నృత్య ప్రదర్శన

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగాలు సందడిగా సాగుతున్నాయి. గురువారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ధ్యాన గురువు పరిణిత పత్రి మాట్లాడుతూ.. శాఖాహార జగత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇతర జీవులపై ప్రేమ, కరుణతో మెలగాలని సూచించారు. ప్రకృతి సహజ సిద్ధంగా లభించే మొక్కల ఆధారిత ఆహారం తీసుకోవాలన్నారు. ధ్యానం ద్వారా పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో ఆచరించకపోతే ప్రయోజనం శూన్యమని పేర్కొన్నారు. అనంతరం ధ్యాన పుస్తకాలను ఆవిష్కరించారు. ధ్యాన వేదికపై కళాకారుల సాంస్కృతిక ప్రదర్శ న లు విశేషంగా ఆకట్టుకున్నాయి. ట్రస్ట్ చైర్మన్ విజ యభాస్కర్‌రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ భాస్కర్ ఉన్నారు.



హాజరైన ధ్యానులు